క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు



రేపల్లె రూరల్: శక్తి వంచన లేకుండా పని చేసే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధిష్టానం ప్రాధాన్యత నిస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై నగరం మండలం కొలగాని వారిపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకులు చేబ్రోలు నాగేశ్వరరావు, కొలగాని గోపిలు నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఎంపీ మోపిదేవి రేపల్లెలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ నవచైతన్య సేవా సంఘం అధ్యక్షులు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరాధ్యుల శివయాదవ్, కరేటి రవి, వెంకటేశ్వరరావు, దానబోయిన వెంకటనరసయ్య, భీష్మ పాములు, పి.యలమంద, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ




తెనాలిఅర్బన్: మైకా మినిస్ట్రీస్ చైర్మన్ పాముల రవికుమారి జన్మదినం పురస్కరించుకుని కొల్లిపర మండలం సిరిపురంలోని అబాడెంట్ లెప్రసీ హాస్పిటల్‌లోని కుష్టు రోగులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాముల జేస్టిస్, పి.రిచార్డ్, అనూష, లెప్రసీ సూపర్‌వైజర్ జంగం శ్యామ్, పి.రజిని, పోతురాజు, నాగరాజు, శ్యామ్‌ప్రసాద్, మాధురి, రూత్ నాగేశ్వరి, సువార్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి



దంతలూరు(కొల్లిపర): దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ ఎం.రవి అన్నారు. గురువారం మండలంలోని దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కూలీకి పనులు ఉన్నాయని అన్నారు. వీటిని 600 మందికి సరిపడా పనులు కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కనపర్తి సాగర్, గ్రామ ఉపాధి వేతన దారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుగ్గిరాల మండలం చిలువూరు స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 45–50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతుడు తెల్ల బనియన్, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు.

ఇసుక లారీ సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు
- విద్యుత్తు కాంతులతో కళకళలాడిన మసీదులు
- ఖురాన్ పఠనాన్ని వినిపించిన మత పెద్దలు



కొల్లూరు సమీపంలోని ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



భట్టిప్రోలులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

భట్టిప్రోలు: 30 రోజుల పాటు కఠిన ఉపవాసాలు ఉండి అల్లాను భక్తి ప్రపత్తులతో ప్రార్థించిన ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనా స్థలాలకు చేరుకున్నారు. పరస్పరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేలాది మంది ముస్లింలు పవిత్ర ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి పేదలకు దాన ధర్మాలు చేశారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో శనివారం పండుగ చేసుకున్నారు. మండలంలోని అద్దేపల్లి, భట్టిప్రోలు, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాలలోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భట్టిప్రోలులోని ఓబీద్ మహల్లా, జామియా మసీదు, అద్దేపల్లిలోని పెద్ద మసీదు, చిన్న మసీదుల నుంచి ఈద్గాల వద్దకు చేరుకుని ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

కొల్లూరు : రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పిల్లల నుంచి పెద్దల వరకు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడంతో అన్ని చోట్లా పండుగ వాతావరణం నెలకొంది. కొల్లూరులోని మసీదు వద్ద నుంచి క్రాప రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు ముస్లిం సోదరులు ప్రదర్శనగా తరలి వెళ్లారు. అనంతరం మత పెద్దల సూచనల మేరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం తమ బంధువుల సమాధుల వద్దకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. మండల పరిధిలోని అనంతవరం, తిప్పలకట్ట, దోనేపూడి, ఈపూరు ప్రాంతాల్లోని ముస్లింలు రంజాన్‌ను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక వంటకాలు తయారు చేసుకొని పండుగను సంతోషంగా నిర్వహించుకున్నారు.

కనగాల, గుళ్లపల్లిలో సామూహిక ప్రార్థనలు

చెరుకుపల్లి: త్యాగానికి ప్రతీక అయిన పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద గురువారం ఘనంగా జరుపుకున్నారు. బుధవారం నెలవంక దర్శనం ఇవ్వటంతో గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ఉదయం నుంచే ముస్లిం సోదరులు ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలోనే ఆవిర్భవించిందని ముస్లిం సోదరుల నమ్మకం. రంజాన్ మాసం మొదలైన రోజు నుంచి ముస్లింలు నియమ నిష్టలతో ఉపవాసాలు ఉంటూ రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తారు. పండుగ రోజున ప్రతి ముస్లిం సోదరుడు వారికి ఉన్నదాంట్లో కొంత నిరుపేదలకు దానమిస్తారు. దీనిని జకాత్ అంటారు. ఈ విధంగా పేదలకు దానం చేయటం ద్వారా పేదవారు కూడా అందరితోపాటు సంతోషంగా పండుగను జరుపుకోవటానికి జకాత్ ఉపయోగపడుతుందని ముస్లింల నమ్మకం. మండలంలోని కనగాల, గూడవల్లి, గుళ్లపల్లి, మెట్టగౌడవారిపాలెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

యడ్లపల్లిలో రంజాన్ వేడుకలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం యడ్లపల్లిలో రంజాన్ పురస్కరించుకుని గురువారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెండా చెట్టు వద్ద ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ముస్లింలు, హిందువులు పరస్పరం ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే చినపరిమిలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని రంజాన్ పర్వదిన విశిష్టతను తెలియ చేశారు.

జంపని(వేమూరు): పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. గ్రామంలో నుంచి ఈద్గా వద్దకు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ మహ్మద్ రషీద్, షేక్ హాజీ జబ్బార్, షేక్ నిజామ్‌వుద్దీన్, షేక్ మస్తాన్ వలీ, షేక్ సుభానీ మాస్టార్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుక అందజేత

రేపల్లె రూరల్: పట్టణంలోని 3వ వార్డులో నివాసం ఉంటున్న ముస్లిం సోదరులకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాల మేరకు రంజాన్ కానుక అందజేశారు. వార్డు కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా పలు నిత్యావసర వస్తువులను అందజేసి మాట్లాడారు. ప్రతి ఏటా రంజాన్‌ను పురస్కరించుకుని వార్డులోని ముస్లిం సోదరులకు రంజాన్ కానుకగా నిత్యవసర వస్తువులు అందజేస్తామన్నారు. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ ఏడాది సైతం అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. నెల రోజులు పాటు అత్యంత పవిత్రంగా నిర్వహించిన ఉపవాస దీక్షలను విరమించిన అనంతరం రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ నియమ నిబంధనల ప్రకారం ప్రార్థనలు చేసే ముందు ప్రతి వ్యక్తి చెల్లించాల్సిన ఫిత్రాలను నిరుపేదలకు అందజేశారు. ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్ద జరిగిన సామూహిక ప్రార్థనలలో కమిటీ పెద్దలు మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఐక్యంగా ఉంటూ పేదలకు తమకు చేతనైనంత సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. మండలంలోని చందోలు, నదిముల్లాయపాలెం, కోడూరు, పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం గ్రామాలలోని మసీదులలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల పరిషత్ మాజీ అధ్యక్షులు షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అఫ్జల్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

వేమూరు: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని 40 రోజులు ఉపవాసంతో ప్రార్థనలు నిర్వహించారు.



గుళ్లపల్లిలో ఈద్గా వద్ద ఖురాన్ బోధిస్తున్న ముస్లిం పెద్ద



చినపరిమిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు



జంపనిలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు



రంజాన్ కానుకను అందజేస్తున్న కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు

ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు

కర్లపాలెం: పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలు రంజాన్ పండుగ ప్రార్థనలతో ముగిశాయి. పండుగ సందర్భంగా యువకులు, పెద్దలు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి దండుబాట సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని కర్లపాలెం కొత్త ఇస్లాంపేట, పాత ఇస్లాంపేట, దండుబాట, ఐలాండ్ సెంటర్‌లోని మసీదులతో పాటు పేరలి, గణపవరం, నాగరాజుపాలెం గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద రంజాన్ ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకుని ముస్లింలు తమకు ఉన్నంతలో పేదలకు దానధర్మాలు చేశారు.



వేమూరులో మసీదులో ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు



కనగాలలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



కర్లపాలెం ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

గ్రామాలలో పోలీసు కవాతు

కర్లపాలెం: సార్వత్రిక ఎన్నికలకు భంగం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కర్లపాలెం ఎస్ఐ జనార్ధన్ హెచ్చరించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బాపట్ల ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పోలీసులు, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్‌తో కలసి మండలంలోని కర్లపాలెం, సమ్మెటవారిపాలెం, తుమ్మలపల్లి గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వలివేరులో రామాలయ వార్షికోత్సవం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం వలివేరు శ్రీ రెడ్ల రామ మందిరం 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం అన్నదానం నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. 15 వందల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తమ్మా కోటిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య మోహన రెడ్డి, సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపీటీసీ అమృతలూరి ప్రవీణ్, గాదె శివరామ కృష్ణారెడ్డి, వి.వెంకట్రామిరెడ్డి, చీడేపూడి సాంబిరెడ్డి, ఆరమళ్ల మహేశ్వరరెడ్డి, విప్పల వెంకట్రామిరెడ్డి, కొండా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం సాయంత్రం పట్టణంలోని శివాజీచౌక్, గాంధీచౌక్, బోస్‌రోడ్డు, చినరావూరుతోట, రామలింగేశ్వరపేట, డిపో సెంటర్, నాజరుపేటలో రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా సీఐ అన్నారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకం కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జోరుగా ఎన్నికల ప్రచారం

తొట్టింపూడి(వేమూరు): నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి వరికూటి లక్ష్మి చుండూరు మండలంలోని తొట్టింపూడి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వేమూరు నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడే నాయకుడు వరికూటి అశోక్‌బాబేనని అన్నారు. ప్రచారంలో గ్రామ సర్పంచ్ వుయ్యూరి వెంకటరెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, చుండూరు సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధాన్యాధివాసం



ప్రత్తిపాడు: అంకమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం నిత్యపూజ, క్షీరాధివాసం, వాస్తు పూజ, పంచామృతాదివాసం, సుగంధ ద్రవ్య స్నపనం, సముద్రోదక అభిషేకం, ఆదివాసం హోమం, మధ్యాహ్నం నవగ్రహ ఆరాధన, సాయంత్రం ప్రధాన కలశవాహన సాలీర్చన, రాత్రి క్షీరతర్పణం, న్యాసకళ, అంగ, ప్రత్యంగ, అధివాస, ధాన్య, పుష్ప వస్త్రాధివాసములను అత్యంత వేడుకగా నిర్వహించారు. ధాన్యాధి వాసానికి గ్రామస్తులు తమ ఇంటి నుంచి ధాన్యాన్ని సమర్పించారు. అనంతరం దర్బార్ సేవ, వేద పారాయణం జరిగాయి. ప్రత్యేక యజ్ఞయాగాదులు, హోమాలను చేశారు.

జగనన్న పాలనతోనే పేద వర్గాలకు న్యాయం

కొల్లూరు : పేద వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే అది జగనన్న పాలనతోనే సాధ్యపడుతుందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కుమారుడు శ్రీతేజస్ అన్నారు. గురువారం మండలంలోని చినపులివర్రులో ఆయన తన తండ్రి అశోక్‌బాబు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు గుంటూరు నీలాంబరం, సూరపనేని వెంకటేశ్వరరావు, భూపతి కిశోర్, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, నాయకులు కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, దున్న వెంకయ్య, దున్న బాబురావు, వరరాజు, బాణాల రవి, చాట్రగడ్డ రామకృష్ణ, కూచిపూడి మోషే, చిలక ప్రకాశం, బిట్రగుంట సత్యనారాయణ, సవరాల నాంచారయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోన తనయుడి ఇంటింటి ప్రచారం

పేరలి(కర్లపాలెం): ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి జగనన్న సంక్షేమ పథకాల అమలుకు మరోమారు అవకాశం కల్పించాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ కోరారు. తన తండ్రి తరపున కోన నిఖిల్ గురువారం సాయంత్రం పేరలి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ తిరిగి కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్నను సీఎం చేయాలని, కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసేందుకు కోన రఘుపతిని గెలిపించు కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, నాయకులు అక్కల శ్రీనివాస రెడ్డి, రాతంశెట్టి లక్ష్మణరావు, నాగేశ్వరరెడ్డి, జయభారత్‌రెడ్డి, కంకిపాటి నాగరాజు, గొర్ల సుబ్బారావు, కిరణ్‌కుమార్, ధర్మేంద్ర, చిరంజీవి, అర్జున్‌రెడ్డి, మీరయ్య, నాగేశ్వరరావు, రామస్వామి, ఏసుబాబు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

పార్కిన్సన్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: భారత దేశంలో చాలావేగంగా పార్కిన్సన్స్ వ్యాధి పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు వ్యాధిపై అవగాహన కల్గి ఉండాలని సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ పార్కిన్సన్స్ డీసీజ్ అవేర్‌నెస్ డే ను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విజయ మాట్లాడుతూ నరాల సంబంధిత రుగ్మతల్లో పార్కిన్సన్ వ్యాధి వల్ల చాలా తీవ్రమైన ఇబ్బందులు రోగులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ వ్యాధికి నేడు అత్యాధునిక డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) అనే అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలోనే తమ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్లు ప్రారంభిస్తామని న్యూరోసర్జన్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత పార్కిన్సన్స్ బాధితుల కోసం డాక్టర్ విజయ ప్రత్యేకంగా ఓపీని ప్రారంభించారు. డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని రోగులు, వారి సహాయకుల సందేహాలను నివృత్తి చేశారు.



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ, పక్కన పలువురు వైద్యులు

కొమ్మమూరు కాల్వకు జలకళ

తాగునీటి అవసరాలకు చెరువులకు నీరు

చేబ్రోలు: ప్రస్తుత వేసవిలో ప్రజల తాగునీటి అవసరాల కోసం కొమ్మమూరు చానల్‌కు నీరు విడుదల చేయటంతో గురువారం చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులకు నీరును ఇంజన్ల ద్వారా మళ్లించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తగినంత వర్షపాతం లేకపోవటంతో ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. వేసవిలో ఎండ తీవ్రత పెరగడంతో తాగునీటి చెరువుల్లోని నీటి మట్టాలు తగ్గిపోయాయి. ప్రకాశం బ్యారేజ్ నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయటంతో కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువుల్లో నీటిమట్టంను పెంచటంతో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల గ్రామాల్లోని మంచి నీటి చెరువులు ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ గ్రామాల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది కాలువల్లోని నీటిని చెరువులకు ఇంజన్ల ద్వారా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

క్రీస్తు మార్గం పవిత్రం

కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్స్



గుంటూరు రూరల్: క్రీస్తుని మార్గం ఎంతో పవిత్రమని, ఆయన మార్గంలో నడిచిన వారికి పరలోక రాజ్యం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్స్ తెలిపారు. గురువారం నల్లపాడులోని మినిస్ట్రీస్ సమీపంలో సువార్త ఉజ్జీవ మహాసభలను ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీస్తుని శృతి గీతాలతో క్రీస్తు నామానాన్ని ఘనపరిచారు. కార్యక్రమంలో భాగంగా 16వ నూతన గీతాల పాటల ఆల్బమ్ సీడీలు, పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్నా, పాస్టర్ డేవిడ్ రాజు, కృపా మినిస్ట్రీస్ సంఘాలు, సేవకులు దేశ నలుమూలల నుంచి క్రీస్తుని భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.